


"అమ్మా!"

కేకకాదది గావుకేక!

ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకి నిద్రలేచి బద్ధకంగా అవలిస్తూ వరండాలోకి వచ్చిన సుశీల, కింద చెట్లకింద ఎండు పుల్లలేరుతున్న తల్లిని చూడగానే ఒక్క కేక పెట్టింది.

సుశీల కేకకి బిక్క చచ్చిపోయి పుల్లలు కింద పారేసి గబగబ లోపలికొచ్చేసింది రాజమ్మ. వీధి వరండాలో బంట్రోతు నర్సయ్యతో కబుర్లాడుతూ బీడి కాలుస్తున్న యాదయ్యా కూడా ఆ కేకకి బీడి విసిరేసి పిల్లిలా లోపలికి నడిచాడు.

మెట్లుదిగి విసవిస హాలులోకి వచ్చింది సుశీల—'అమ్మా... ఏం చేస్తున్నావు అక్కడ—' అరిచినట్టే అడిగింది.

"నీళ్ల కాగుకింద కొస్తాయని ఎండు పుల్లలుంటే ఏరతున్నాను..." నసుగుతూ అంది రాజమ్మ.

"నీళ్లకాగుకి కావలిస్తే కర్రలు కొంటాను. యిలా పుల్లలు, పిడకలు అంటూ నిన్నా వెధవపనులు చెయ్యవద్దని ఎన్నిసార్లు చెప్పానిది వరకు. అమ్మా! నాన్నా! మీరిద్దరూ నన్ను పరువుగా బతకనీయరా... ఛీ... ఛీ.. కుర్చీ మీద దర్జాగా కూర్చోండి అన్నా కూడా మీకు కష్టంగా వుంది. అంతే... కనకపు సింహాసనం మీద కూర్చున్నా బుద్ధులు ఎక్కడికి పోతాయి. మీ వల్ల నాకు చచ్చే తలవంపులుగా వుంది. "నాన్నా! నీకెన్నిసార్లు చెప్పాను, అలా బంట్రోతులతో కలిసి కబుర్లాడవద్దని. వాళ్లకి నేనంటే ఎంత చుల్కన అవుతుందీ నీకసలు తెలుస్తూందా..."

"ఏదో పొద్దుపోక..." తండ్రి నసిగాడు.

"పొద్దుపోకపోతే పేపర్లున్నాయి, పుస్తకాలున్నాయి. రేడియో విను. అక్షరం ముక్కలు వచ్చుగదా. చదువుతూంటే అదే అలవాటవుతుంది. పుస్తకాలు చదువు అంటే వినవేం. సాయంత్రం అలా వాక్‌కి వెళ్లు, లైబ్రరీకి వెళ్లు... అంతేగాని బీడీలు కాలుస్తూ బాతాఖానీలు మాను నీకు పుణ్యం వుంటుంది. నా పరువు సంగతన్నా ఆలోచించండి." కాస్త కటువుగా అని విసవిస మళ్లీ మేడ మీదకి వెళ్లిపోయింది అసిస్టెంట్ కలక్టరు సుశీల.

"ఏదో గుడిసెలో కలోగంజో తాగినపుడే పానం సుకంగా వుంది. మేడలోకి తీసుకొచ్చి కుర్చీలో కూచోపెట్టింది సరే, బాగుంది... కాని యిక్కడ కూకోకు, అక్కడ కూకోకు, యిది సెయ్యకూడదు అది సెయ్యకూడదు. అలా నవ్వకు, అలా మాట్లాడకు, అలా కొప్పు సుట్టకు, సీర ఎగ్గట్టకు, అలా తినమాకు, అంత తినమాకు, అక్కడ ఊయకు, యిక్కడ బట్టలేయకు... యిదేటి ఏది సేసినా తప్పంటే సస్తామా... కలక్టరమ్మయితే ఎన్నీళ్లు పోసుకోదేటి? సెట్టు కింద ఊరికే పుల్లలు పడున్నాయని ఏరితే అలా ఎగిరి పడ్తుంది... కన్నతల్లి అని కూడా సూడకుండా సిన్నపిల్లలా కసురుతది... నా గుడిసెలో నానుండపుడే సుకంగుంది పానం..." రాజమ్మ చురచుర మొగుడిని చూస్తూ అంది.

"బాగుందే యిప్పుడది నీ కూతురేంటి మరి... ఊరంతటికి పెద్ద ఆపీసరు. దాని పరువు సూడాలిగదా మనం... ఏటో మన ఎదవబుద్ధులు మారవు... ఆ పుస్తకాలు సదవబుద్ధి గాదు... పడుకుంది గదా అని నర్సింలుతో కబుర్లేసుకున్నా... ఇంతలో లేస్తాదనుకోలేదు."

"ఏందయ్యా మరీ అట్టా కూతురికి బయపడి సస్తావు... దాన్నింత దాన్ని సేసిందెవరు, మనం కాదేటి, యీనాడు కలక్టరమ్మయిందని కన్నోళ్లనే ఛీ కొడ్తుందా... అసలు నిన్ననాలి, 'నా కూతురు... సదివిస్తా, ఆపీసరు సేస్తా, కలక్టరు సేస్తా' అని సంకలు గుద్దుకున్నావు. కలక్టరమ్మ అయ్యి కుర్సీ మీద కూకో పెడ్తుందని మురిసావు. కుర్సీలో కూకో పెట్టి కూడెడితే సరిపోతుంది గాబోలు. మనం మడుసులం కామేటి—కుక్కల్లా గుమ్మానికి కట్టేసి కూకోమంటే కూకోడానికి—'ఉక్రోషంగా అంది రాజమ్మ. పెళ్లాం మాటల్లో నిజం వుందని యాదయ్యకి తెలుసు కనక జవాబివ్వలేకపోయాడు. "బంట్రోతు కూతురినని మర్చిపోయిందిగాబోలు... ఈనాడు కలక్టరమ్మ కాంగానే బంట్రోతుతో మాట్లాడితే పరువు పోతుందంట..." నిరసనగా అంది.

"ఊరుకోయే... దాని సంగతి, కూడా మనం ఆలోసించాలిగా.. అదేమంది? 'తిని కోకోండి' అంది గాని రాళ్లెత్తమందా, తట్టలు మోయమందా."

"రాళ్లెత్తి నపుడే నయం—పానానికి సుకం వుండేది. తిన్నది వంట బట్టేది. యిప్పుడు ప్రతి నిమసం ఏం సేస్తే ఏం తప్పో, ఎక్కడ కూసుంటే ఏం ముప్పో అని పానం ఉగ్గబట్టుకుని బతకడం... సీ, కూతురికి బయపడే ఎదవ బతుకయిపోయినాది." రాజమ్మ గొణు

క్కుంటూ లోపలికెళ్ళిపోయింది.

ఛా... వీళ్లెంత చెప్పినా ఎందుకు మారరు? మట్టిలో పుట్టాం అని యింకా మట్టి పిసుక్కుంటూనే వుండాలా... గుడిసెల్లో పందుల్లా బతికిన వాళ్లని మారడానికి అవకాశం యిచ్చినా యింకా బురద గుంటల్లోనే దొర్లాలా... తనేం అంది? హాయిగా తిని కూచోండి... కాస్త సంస్కారం అలవరుచుకోండి అంటే వినరేం!... నిజమే అట్టడుగు వర్గాల నించి వచ్చారు తాము. అదృష్టం బాగుండి. తను చదువుకుని, మంచి హోదా తెచ్చుకుంది. యిప్పుడైనా యీ అవకాశం అంది పుచ్చుకుని వీళ్లెందుకు బాగుపడరు? నిజమే! తండ్రి కడుపు కట్టుకుని చదివించాడు. ఆడపిల్లకి చదువులెందుకు, నాలుగిళ్ల పాచి పని చేసుకుంటే రెండొందలొస్తాయి అని సాధించే తల్లిమాట వినకుండా చదివించాడు. ముందు నించి తెలివిగా చదువుకుంది. ఫస్టున పాసయ్యేది... చిన్నప్పటినించి, స్కూల్లో చదువుకునే దగ్గరనించి తోటి పిల్లల్లా తన తల్లి తండ్రి వుండాలని, యిల్లు, వళ్లు శుభ్రంగా వుంచుకోవాలని తాపత్రయపడేది. తను చదువు యిచ్చిన విజ్ఞానంతో సంస్కారం అలవరుచుకుంది. గాని తన వాళ్లని మార్చలేకపోయింది... మెట్రిక్ ఫస్టున పాసవగానే స్కాలర్ షిప్పు సంపాదించుకుని పట్టుపట్టి కాలేజీలో చేరింది. కనీసం డిగ్రీ తెచ్చుకోవాలని తన ఆరాటం... బి.ఎ. ఫస్టున పాసయింది కష్టపడి... తన అదృష్టం బాగుండి తండ్రి పనిచేసే సివిల్ సప్లయ్ ఆఫీసుకి అసిస్టెంట్ కమీషనర్‌గా కలక్టరు విజయలక్ష్మి వచ్చింది... తండ్రి గొప్పకోసం తనని వెంట పెట్టుకుని ఆఫీసరమ్మగారికి చూపించాడు., ఆవిడ ప్రోత్సాహం, సహాయం వల్ల తనీనాడు కలక్టరయింది. యింత తెలివైన పిల్లని చదువు మాన్పించకు—అని తండ్రికి గట్టిగా చెప్పింది. ఐ.ఎ.ఎస్. కి కట్టమని తనని ప్రోత్సాహించింది. వుత్తిప్రోత్సాహమే కాకుండా తాను చదివిన పుస్తకాలిచ్చింది. ఆర్థిక సహాయం చేసింది. పరీక్షకి ఎలా ప్రిపేరు అవ్వాలో చెప్పింది. తెలియనివి కూచోపెట్టి చెప్పింది. ఆవిడ అండదండలుండబట్టి 'తనేమిటి కలక్టరేమిటి' అని నిరుత్సాహ పడకుండా చదివింది. మొదటి పదిహేను మందిలో వచ్చింది. అసిస్టెంటు కలక్టరయి మొదటి పోస్టింగ్ పార్వతీపురానికి వచ్చింది.

లంకంత బంగళా బ్రిటిష్ కాలంనాటిది. చుట్టూ ఎకరాల స్థలం... వంటకి మనిషి, పనికి మనిషి, తోటకి మనిషి, జీపుకి డ్రైవరు, అన్ని హంగులూ, సమకూర్చుకుని... తండ్రి రిటైరవడానికి యింకా రెండు మూడేళ్లున్నా ఉద్యోగం మాన్పించి తీసుకొచ్చేసింది. తమ్ముడిని, చెల్లెలిని స్కూల్లో జాయిన్ చేసింది. ఇదంతా తను ఎందుకు చేసిందని ఎవరూ గుర్తించరేం? తన వాళ్లు యింకా కష్టపడకూడదని, యిప్పుడైనా సుఖపడాలని గదా తన కోరిక! తన వాళ్లు అట్టడుగునించి పైకి వచ్చి సభ్య సమాజంలో సంస్కారవంతంగా గడపాలని గదా తన ఆరాటం! అదేం గుర్తించరేం తనవాళ్లు!

ఎంత చెప్పినా తల్లి ఎక్కడ పడితే అక్కడ తుపుక్కు తుపుక్కుమని వుమ్ముతుంది. ఎక్కడ పడితే అక్కడ కాళ్లు జాపుకుని చతికిలపడ్తుంది. అసహ్యంగా పేలు కుక్కుతుంది చెల్లెలికి. బల్లమీద కూచుని తినమంటే తినకుండా రెండు కాళ్ల మధ్య గిన్నె పెట్టుకుని అసహ్యంగా తింటుంది. బట్టలుతకడానికి పనివాళ్లున్నా కుళ్లు బట్టలు ఉతికించుకోదు... వంట ఆమెతో, పనిమనిషితో వెంట వెంట తిరుగుతూ పోచికోలు కబుర్లు చెపుతుంది. చెప్పులు కొని యిచ్చినా బయట కూడా వుత్త కాళ్లతో తిరుగుతుంది. తండ్రి కాస్తనయం, కాస్త చెప్పులేసుకుని ఉతికిన తెల్లపంచె కట్టుకుంటాడు. కాని బంట్రోతులతో బాతాఖానీలు మానడు. కాస్త చదవడం వచ్చు. పుస్తకాలు పత్రికలు చదవమని కొనిపడేసినా ఏదీ చదవడు. ఆ చుట్టలు మానమంటే వినడు. తన కోసం ఆఫీసు వాళ్లెవరన్నా యింటికొస్తే మా అమ్మాయిని యిలా కష్టపడి చదివించాను. కలక్టరుని చేశానని గొప్పలు చెపుతూ కబుర్లు వేసుకుంటాడు.

ఇంకతమ్ముడున్నాడు. పొట్టపొడిస్తే అక్షరం ముక్క అబ్బదు వాడికి. కాని షోకులకి వేషాలకి లోటు లేదు. టైటు టెర్లిన్ పాంట్సు, చవకరకం జిగేలుమనే షర్టులు, రంగు రంగుల సాక్సు బూట్సు వేసుకుని సెంట్లు రాసుకుని జులాయిలా రోడ్లంట తిరగడం, క్లాసులు ఎగగొట్టి మాట్నీలకి వెళ్లడం, కిళ్లీ కొట్లలో అరువులు పెట్టి సిగరెట్లు కాల్చడం... చెత్త పత్రికలు చదవడం... యిదీ వాడి వరస.

చెల్లెలుందంటే తొమ్మిదేళ్లు వచ్చినా చెడ్డీ లాక్కుంటూ గౌను అన్నా లేకుండా పెరట్లో మట్టిలో పొర్లుతూంటుంది. చీమిడి ముక్కు, చింపిరి జుత్తు, జుత్తు నిండా పేలు... స్కూలుకి తిట్టి పంపిస్తే దానిష్టం వచ్చినపుడు చెప్పకుండా చెయ్యకుండా యింటికి వచ్చేస్తుంది. తిడితే, కొడితే తల్లి శోకాలు పెడ్తుంది.

వాళ్లందరిని అదుకుని వాళ్లని సుఖపెట్టాలని తీసుకొస్తే అందరూ కల్సి తనకి తలవంపులు తీసుకొస్తున్నారు. తనవాళ్లని చూసి బంట్రోతులు ఎలా నవ్వుకునేది, డ్రైవరు వాళ్లు ఎలా గుసగుసలాడుకునేది—తన చెవిన పడకపోలేదు. బంట్రోతుల ద్వారా ఆఫీసులోకి కూడా వార్తలు వెళ్లి అందరూ తన వాళ్ల గురించి హేళనగా మాట్లాడుకుంటున్నారని తనకి తెలుసు! గత ఏడాదిగా వాళ్ల వలన పనివాళ్లముందు తనెన్నిసార్లు అవహేళనలు, అవమానాలు ఎదుర్కోవలసి వచ్చిందో తనకి తెలుసు!

ఛీ... వీళ్లు మారరు... వీళ్లని మార్చడం తన వల్లగాదు... విసుగ్గా, ఆవేదనగా అనుకుంది సుశీల కుర్చీలో జారగిలబడి కళ్లు మూసుకుని. అసలే నిన్నటినుంచి... రమాకాంత్ ఉత్తరం వచ్చిన దగ్గరనుంచి అవమానంతో ఆవేదనతో ఆమె మనసు ఉడికి పోతూంది. అసలే ఓ రకం విరక్తి, నిరాశ, నిస్పృహలమధ్య టెన్షన్‌లో వున్న సుశీలకి ఆ దృశ్యం అవసరాన్ని మించిన ఆవేశాన్ని కలుగజేసింది.

రమాకాంత్ సుశీలతోపాటు ఐ.ఎ.ఎస్. ట్రైనింగ్ పొయ్యాడు. ఆ బ్యాచ్‌లో వాళ్లిద్దరే తెలుగు వారవడంతో మొదట్లో పరిచయం, తరువాత స్నేహం... ఆ తరువాత మనసులు కలవడం... ఒకరంటే ఒకరికి యిష్టం పెరగడం... ట్రైనింగ్ పీరియడ్ సంవత్సరం అయ్యేసరికి యిద్దరూ అతిచేరువ అయిపోయారు. రమాకాంత్‌కి ఖమ్మం సబ్ కలక్టరుగా పోస్టింగ్ వచ్చింది. ఎవరి ఉద్యోగాలలో వారు చేరాక ఆరు నెలలు యిద్దరి మధ్య ఉత్తరాలు నడిచాయి. ఎదుట వుండగా చెప్పుకోలేనివి ఉత్తరాల ద్వారా సులువుగా చెప్పుకున్నారు మనసులు విప్పి... నెల రోజుల క్రితం రమాకాంత్‌నుంచి వచ్చిన ఉత్తరం అందుకున్న సుశీల మనసు పురివిప్పిన నెమలిలా అయింది. "మన యీ పరిచయం పరిణయంగా మారాలి అని.... యీ స్నేహం శాశ్వత బంధం కావడానికి గత ఏణ్ణర్థంగా మనం వేసిన పునాదులు గట్టిపడ్డాయని భావించి... నీ చేయి అందివ్వమని అడగడానికి నాల్గురోజులు శలవు సంపాదించి వస్తున్నాను. నన్ను కాదనవని, నిరాశపరచవన్న నమ్మకంతో, ఆశగా చేతులు చాచి వస్తున్నాను..." ఆ ఉత్తరం ఎన్నిసార్లు చదువుకుందో సుశీల. చదువు, సంస్కారం, హోదా, అందం అన్నీ వున్న రమాకాంత్‌ని కోరడం అత్యాశ ఏమోనని మొదట్లో జంకింది. రోజులు గడిచాక అతని మాటలు, చేతలు, చూపులు, అర్థం చేసుకోలేనంత వెర్రిది కాదు కనక, వాటికి అర్థాలు తెలిసి మనః పూర్వకంగా అతనిని అన్ని విధాల ప్రోత్సహించింది. అతను తన వాడయితే యింతకంటే తను కోరుకునేది ఏముంటుంది... అతని రాక కోసం ఆశగా ఎదురు చూసింది.

అతని కోసం ఆ నాలుగు రోజులు శలవు పెట్టింది... ప్రత్యేక శ్రద్ధ తీసుకుని యిల్లంతా అలంకరించింది. స్వీట్లు, పళ్లు కొంది-తన కోసం కొత్త చీరలు కొనుక్కుంది.

స్టేషనులో అతన్ని రిసీవ్ చేసుకుంటూంటే రమాకాంత్ చూసిన చూపుకి, మెత్తగా తన చెయ్యి చేతిలోకి తీసుకున్నప్పుడు పులకరించిపోయింది. రెండు రోజులు ఈ లోకంలో లేనట్టే చుట్టూ ప్రపంచాన్నే మరిచిపోయి అతని సమక్షంలో గడిపింది. ఎన్నెన్నో మాటలు, మరెన్నో జ్ఞాపకాలు గుర్తు చేసింది. ఓ రోజు పిక్నిక్, యింకో రోజు పార్టీ... మరో రోజు సినిమా... ప్రోగ్రాంలు వేసింది... అన్నింటి మధ్య రమాకాంత్ వచ్చిన రోజు వున్నంత ఉత్సాహంగా తరువాత లేడన్నది గుర్తించలేకపోయింది. ముందు రోజు మాట్లాడినట్టు తరువాత రోజులు అంత మాట్లాడకుండా ముభావంగా పరధ్యానంగా వున్నాడన్నది కనిపెట్టలేకపోయింది. అనుకున్న దానికంటే ఒక రోజు ముందే ప్రయాణం అయ్యాడు. పక్క వూరిలో ఎవరో బంధువులున్నారు చూడాలంటూ బయలుదేరిన రమాకాంత్‌ని అర్థం కానట్టు చూసింది. రమాకాంత్ వెళ్లాక గాని... రమాకాంత్ చెప్పాలని వచ్చిన మాటలు ఏమీ చెప్పలేదన్నది గుర్తు రాలేదు. చేయి అందుకోడానికి అడగలేదన్నది తట్టాక ఆమె మనసు కాస్త చిన్నబోయింది. ప్రత్యేకంగా యింకా ఏం అడగాలని చెప్పి అడగలేదేమో... భవిష్యత్తు గురించి ఏం చర్చించకుండా, నిర్ణయాలు తీసుకోకుండానే మూడు రోజులు దొర్లించేశారేతాము... అతను ఏదన్నా చెపుతాడేమోనని చూసింది తను... ఏం చెప్పని అతన్ని చూసి యింత దూరం వచ్చాక యింకా అడగడాలు, అంగీకరాలు అవసరం ఏమిటని అడగలేదేమో—అని సరిపెట్టుకుంది. పది రోజులు వరకు రమాకాంత్‌నుంచి ఉత్తరం కోసం ఆశగా ఆరాటంగా ఎదురు చూసింది. ఆమె సందేహాలకి, ప్రశ్నలకి, జవాబులుగా ఆఖరికి రమాకాంత్‌నించి పదిహేను రోజుల తరువాత వచ్చిన ఉత్తరాన్ని ఆనందంగా, ఆశగా, ఆరాటంగా అందుకుంది.

"డియర్ సుశీలా... ఈ ఉత్తరం ఇలా రాయాల్సి వస్తుందని నేను మన పరిచయం అయ్యాక ఏనాడు అనుకోలేదు. ఎదురుగా చెప్పలేక, నిన్ను నొప్పించలేక మరో గత్యంతరం లేక యిలా రాసినందుకు నీవు ఎంత నొచ్చుకుంటావో, ఎంత బాధపడ్తావో తెల్సినా రాయక తప్పలేదు..." ఆ ఉత్తరం చదువుకుంటున్న సుశీల మనసు ఒక్కసారి గతుక్కుమంది. ఏమిటి రమాకాంత్ యిలా రాస్తున్నాడు—తరువాత అక్షరాల వైపు ఆమె కళ్లు పరిగెత్తాయి గబగబ...

"సుశీలా మన పరిచయం అయిన ఈ ఏణ్ణర్థంలోనూ నేను ఏనాడూ నీ గురించి వివరాలు తెల్సుకోవాలని గట్టిగా ప్రయత్నించలేదు. కులాలు గోత్రాలు అడగడం సభ్యత కాదని... చదువుకునీ, సంస్కారం అలవరుచుకు

న్నా మనుకుంటూ రెండు మనసులు కలిశాక ఇంకా కులగోత్రాలు అడ్డు గోడలు కాకూడదు అని నిర్ణయించు కున్నాను. నాకు నచ్చింది నీ రూపం. నీ సంస్కారం, నీ సహృదయత. నా అర్ధాంగిగా ఏమేం కావాలని కోరుకు న్నానో అవన్నీ నీలో కన్పించి సంతృప్తి పడ్డాను. సింపుల్ గా, నిర్మలంగా, చక్కని శరీర సౌష్టవంతో, శుచిగా, శుభ్రంగా, విజ్ఞానంతో మెరిసే నీ కళ్లల్లో తెలివి తేటలని చూసి నీవు అయినింటినించి వచ్చిన అమ్మాయివి అయివుండవు అన్న ఆలోచనే రాలేదు నా మనసులోకి ఎప్పుడూ... ఒకసారి ఏదో మాటల సందర్భంలో నీ తండ్రి సివిల్ సప్లయ్ ఆఫీసులో పని చేస్తున్నారని చెప్పావు. ఏదో మామూలు గుమాస్తా ఉద్యోగం అయి వుంటుంది. ఏ పెద్ద ఆఫీసరో అయితే ఆ విషయం చెప్పేదానివి గదా... 'సరే నాకు కావాల్సింది నీ తండ్రి హెూదా కాదు గదా' అనుకున్నాను.

అక్కడే నేను చాలా పొరపాటు చేశానని యిప్పుడు తెలుసుకున్నాను. సుశీలా! వివాహం అంటే ఇద్దరి మనసుల కలయిక, యిద్దరి కలయిక మాత్రమే కాదు. రెండు కుటుంబాల కలయిక. నా కుటుంబం—నీ కుటుంబం మధ్య పూడ్చలేని అగాధమంత దూరం వుంది అన్నది, నీ దగ్గరున్న మూడు రోజులలో నాకర్థం అయింది. నా తండ్రి జిల్లా జడ్జి, నా తల్లి కాలేజీ లెక్చరరు. నా చెల్లెలి భర్త పెద్ద డాక్టరు, నా తమ్ముడు యింజనీరు... నా తాతగారు ఆకాలంలోనే పెద్ద వకీలు. నా మాతామహుడు ఆ రోజుల్లో ఐ.సి.ఎస్. చేసిన విద్యాధికుడు... ఉన్నత వర్గంలో, ఉన్నత కుటుంబంలో నిష్ఠ, నియమాల మధ్య పుట్టి పెరిగిన నేను... నిన్ను చేసుకుంటే కులాల, గోత్రాల భేదాలు అటుంచి ఆ వాతావరణంలో యిమడగలనా అనిపించింది. నిజంగా నేనేనాడూ ఊహించనంత షాక్ అయ్యాను నీవాళ్లని చూసి. నిన్ను చూసి నీలాగే నీ వాళ్లు చదువు, సంస్కారం వున్నవాళ్లు అయివుంటారని పొరపడ్డాను. బడుగు వర్గాలు, చేయూతనివ్వాలి, పైకితేవాలి—యి లాంటి కబుర్లన్నీ వుత్తప్పుడు బాగుంటాయిగాని, వివాహ సందర్భంలో మన వాళ్లు అనే 'సమాన వియ్యం' అనే మాటకి అర్థం నాకిపుడు బాగా బోధపడింది—పోనీ నీ వాళ్లతో నాకేమిటి అనుకుందామన్నా... ఆ యింట్లో అందరికీ ఆధారం నీవన్నది నాకర్థం అయింది. నీ తమ్ముడిని పైకి తేవాలి. నీ చెల్లెలికి పెళ్లి చెయ్యాలి. దమ్మిడీ సంపాదన లేని నీ తల్లి తండ్రుల పోషణ జీవితాంతం నీదే అన్నది అర్థం అయ్యాక పెళ్లి అయిన తరువాత—'నీ వాళ్లని వదిలేయి. వాళ్లకీ నీకూ ఏ సంబంధం వుండరాదు' అని ఆంక్షలు పెట్టేంత దుర్మా ర్గుడిని కాలేను... పెళ్లి అయి నా భార్య తన వాళ్లని ఆదుకుంటూ తన సంపాదన అంతా వారికే వినియో గించుకుంటే ఆమోదించగలిగే సంస్కారం సహృద యత నాకున్నాయని అనిపించడం లేదు... ఈ పెళ్లి చేసుకుని నా వాళ్లందరి మధ్య అవహేళనలకి గురి అయి, అవమానాలు సహించాల్సివుంటుంది అన్నది తెలుస్తూంది. నా వాళ్లు నిన్నెప్పటికీ కోడలిగా అంగీక రించరు. నీ వాళ్లని అసలు వారి దరిదాపులకి కూడా రానీయరు. యిలాంటి స్థితిలో మనం యీ పెళ్లి చేసుకుంటే నా వాళ్లందరికి దూరం అయి, నీ వారి మధ్య యిమడలేక 'ఎందుకీ పెళ్లి చేసుకున్నా ను'—అని భవిష్యత్తులో వగచి, విచారించి, దాని వల్ల మన మధ్య కలతలు, కలహాలు తలెత్తి కాపురం నరకం చేసుకునే కంటే ఆది నిష్ఠూరమే నయం అనిపిస్తూంది. కొన్నాళ్లు బాధపడతాం—మరిచిపోవడానికి ప్రయత్ని స్తాం... ఎవరి దారి వారిదవుతుంది... ఎవరి జీవితాలు వారివి అవుతాయి. గత పదిహేను రోజులుగా అన్ని రకాలుగా ఆలోచించి, ఆలోచించి ఆఖరికి నిర్ణయం నీకు, నాకు మంచిదే అనిపించి ఈ ఉత్తరం రాస్తున్నా ను. నన్ను క్షమించ గలిగితే క్షమించమని కోరుతూ

—రమాకాంత్

ఉత్తరం చదివిన సుశీల మొహం అవమానంతో నల్లబడింది. లోపల్నించి ఉక్రోషం, ఆక్రోశం తన్నుకొ చ్చింది... ఎంత దగా... ఎంత అవమానం... ఎంత హేళన! ఎంత వ్యంగ్యం! నీ వెక్కడ నేనెక్కడ అని చెప్పుచ్చుకొట్టినట్టు ఎలా చెప్పారు రమాకాంత్!.... బంట్రోతు కూతురినని ఈ సమాజంలో మనుష్యులు నన్ను మరిచిపోనీయరన్నమాట! అందని పండ్లకి అర్రు లు చాచిందాతను! కలక్టరయినంత మాత్రాన గతం చెరిగిపోదని రమాకాంత్ లాంటి విద్యాధికులు కూడా నమ్ముతూంటే యింకా తను చెప్పగలిగింది ఏముంది!... అవమానంతో, ఆవేశంతో, ఆవేదనతో ఆఫీసులో కూర్చో లేక యింటికొచ్చి తలుపులు బిగించుకుని మనసులో బరువు తీరే వరకు ఏడ్చింది నిన్నంతా... ఇంతకీ కారణం తన పుట్టుక. తన వాళ్లు అన్న నిజం మనసులో ముల్లులా దొలుస్తున్న సమయంలో తల్లిదండ్రుల ప్రవ ర్తన అగ్నిలో ఆజ్యం పోసినట్లనిపించింది. ఏదో విరక్తి, వైరాగ్యం... నిర్లిప్తత, నైరాశ్యం... మనసుని దొలిచేస్తుండ గా సుశీల మామూలు మనిషి కాలేకపోయింది.

మర్నాడు డిస్ట్రిక్ట్ కలక్టరు టూరు మీద వస్తే ట్రావ లర్స్ బంగళాలో కల్సుకుని మాట్లాడి రెండు గంటలు ఆలస్యంగా ఆఫీసులో అడుగు పెట్టింది సుశీల. వెంట, పి.ఏ. మూర్తి కూడా వున్నాడు. ఆఫీసులో అడుగుపెట్టగా నే వినబడిన మాటలకి అప్రయత్నంగానే ఆమె అడుగు లు ఆగిపోయాయి.

"ఏంటీ? కలక్టరమ్మగారి అమ్మగారు చెట్లకింద పుల్లలే రుతున్నారుట. రేపొద్దుట తట్టవట్టుకుని పేడ ఏరి పిడకలు చేస్తుందేమో..." డిస్పాచ్ క్లర్కు సుబ్బారావు నవ్వుతూ అంటున్నాడు.

"కలక్టరమ్మ అయితే వేడి నీళ్లు పోసుకోదా ఏమిటి? అందుకే పుల్లలేరి కూతురికి కర్రలు ఆదా చేస్తూంద య్యా..." టైపిస్టు నారాయణ ఎగతాళి.

"కర్ర లేరుకునే వాళ్లు-పిడకలు చేసుకునే వారు అంట్లు తోముకునేవారు అందరూ మరి కలక్టర్లు, డాక్టర్లు, ఇంజనీర్లు అవబట్టే దేశం యిలా తగలడుతోంది." ముక్కు పొడుం పీలుస్తూ హెడ్ క్లర్కు సుబ్రమణ్యం అన్నాడు.

"బాగుందండోయ్... అంట్ల తోముకునే వారు తోము కుంటూనే వుండిపోవాలంటారంటారేమిటి... వెనకబ డిన వాళ్లని పైకి తేకూడదంటారేమిటి..." బంట్రోతు నర్సింలు సానుభూతి.

"మీరేం వెనకబడిన వాళ్లయ్యా... అదృష్టవంతుల య్యా! బాబూ! ముప్ఫై మార్కులు వచ్చినా సీట్లు మీకే. థర్డు క్లాసులో పాసయినా ఉద్యోగాలలో రిజర్వేషన్లు మీకే. చవక బియ్యాలు మీకు, చవక చీరలు మీకు... మీరేం వెనకబడిన వారయ్యా... మేమూ వెనకబడిన వాళ్లం-అ న్ని విధాల నష్టపోతున్నవాళ్లం మా మధ్య తరగతి వాళ్లం" సుబ్రమణ్యం అన్నాడు.

"అద్సరే... కలక్టరమ్మగారి ప్రేమకథకి తెరపడిపో యిందేమిటయ్యా... యింటర్వెల్ కాకముందే! నిన్న ఉత్తరం వచ్చింది... అమ్మగారి మొహం మాడిపోయిన అట్లులా నల్లబడిపోయింది. నాలుగు రోజులు విహారా లు సడన్‌గా బ్రేకేసినట్లు ఆగిపోయాయేమిటి?

"ఏముంది—ఆ రమాకాంత్‌గారు యింటికి వచ్చి పిడకలు చేస్తున్న తల్లిని, తుపుకు తుపుకు వుమ్ముతున్న తండ్రిని, చీమిడి ముక్కుతో తిరిగే చెల్లెలిని, జులాయి లా తిరిగే తమ్ముడిని చూసి మొహం తిరిగి పోయి పెళ్లి



ఎన్. సి. సి. లో

## రాయవరపు రుక్మిణీదేవి

కుమారి రాయవరపు రుక్మిణీదేవి జన్మించింది కాకినాడలో. హైస్కూలు విద్యాభ్యాసం సెయింట్ జార్జస్ గరల్స్ గ్రామర్ స్కూల్, హైద్రాబాద్ లోనూ, టింపనీ స్కూలు, విశాఖపట్టణంలోనూ పూర్తిచేసి ప్రస్తుతం మేరీస్టెల్లా కాలేజీ విజయ వాడలో బి. ఏ. సెకండ్ యియర్ చదువుతున్నది. యింటర్మీడియట్ పరీక్ష అత్యున్నత శ్రేణిలో ఉత్తీర్ణురాలై ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటువారి తెలుగు విజ్ఞాన పారితోషికం అందుకున్నది.

ఎన్. సి. సి లో చేరిన మొదటి సంవత్సరం లోనే అత్యద్భుత ప్రతిభను ప్రదర్శించి అండర్ ఆఫీసర్‌గా ప్రమోషన్ను సంపాదించి 'కంటిజంట్ కమాండర్'గా ఆంధ్రప్రదేశ్ కంటిజంట్ కు నాయకురాలుగా 1987 లో హైద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో పెరేడ్ నిర్వహించింది. అనేక మెడల్‌లు, షీల్డ్‌లు పొంది, 1988 జనవరిలో న్యూఢిల్లీలో జరిగిన రిపబ్లిక్‌డే పెరేడ్‌లో పాల్గొన్నది. పోటీలలో జాతీయస్థాయిలో మూడవ స్థానం పొందింది. ప్రస్తుతం ఎన్. సి. సి వారి 'యూత్ ఎక్స్చేంజ్' ప్రోగ్రాంలో కెనడా వెళ్ళింది. స్కూలులోనూ, కాలేజీలోనూ అనేక ఆటల పోటీల్లో పతకాలు బహుమతులు గెలుచుకొని ఎన్. సి. సి లో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ వద్ద నుంచి బంగారు పతకాన్ని పొందిన కుమారి రుక్మిణీదేవి ఆశయం—ఐ. పి. ఎస్ లో విజయాన్ని సాధించడం!

వద్దు పెటాకులు వద్దు అని పారిపోయి వుంటాడు..."

"కాదయ్యా మరి ... ఎంత ఈవిడ కలక్టరయితే మాత్రం వంశం, సంప్రదాయం, కుటుంబం చూసుకోవద్దూ.... పెళ్లా... మరొకటీనా... అందులో ఆ రమాకాంత్‌గారు తాతముత్తాతలు ఐ.సి.ఎస్‌లు, జడ్జీలు.... అంత ఉద్యోగాలు చేసినా సంధ్య వార్చనిదే విస్తరి ముందు కూర్చోని సాంప్రదాయం వాళ్లది... వాళ్ల చెప్పులు పట్టుకోడానికి కూడా వీళ్లు సరిపోలేరు..." హెడ్ గుమాస్తా సుబ్రమణ్యం అంటున్నాడు.

"భలే వాళ్లులే... పనిమీద బంగళాకి వెడితే వాళ్లని చూస్తూ నవ్వాపుకోలేక చస్తూంటాను" టైపిస్టు అంటున్నాడు.


గుర్తించలేనట్టుగా నల్లబడిపోయిన మొహంతో స్థాణువులా నిలబడిపోయిన సుశీలని చూసి చప్పున తెలివి తెచ్చుకుని చకచక లోపలికి అడుగులు వేశాడు పి.ఏ. మూర్తి... వెనకాతల తప్పుచేసిన దానిలా తలొంచుకు నడిచి తన గదిలోకి వెళ్లిపోయింది సుశీల. కుర్చీలో కూలబడి అవమానంతో దహించుకుపోతూ.... ఆవేశంతో శరీరం వణుకుతూండగా టేబిల్‌మీద రెండు చేతుల మధ్య తలనొక్కి పట్టి మనసుని, శరీరాన్ని కంట్రోలు చేసుకోడానికి ప్రయత్నించ సాగింది.

"సారీ మేడమ్... ఆఫీసు స్టాఫ్ అందరి తరుపున నేను క్షమాపణ చెపుతున్నాను. అందరినీ బాగా కేకలు వేశాను... లోకులు కాకులు... మీరా మాటలన్నీ పట్టించుకోకూడదు" మూర్తి సానుభూతిగా అభిమానంగా అన్నాడు... సుశీల తెలివి తేటలు, ఆమె సమర్థత పట్ల అతనికి నిజంగానే గౌరవం వుంది. "మీరు ఇలా బాధపడకూడదు మేడమ్" సుశీల తలెత్తి అతని వంక చూసి శుష్కహాసం చేసింది..." "బాధ ఎందుకు... వాళ్లన్నవన్నీ నిజాలేగా..."

"ఏదో ఒకటి అనడం, అనుకోడం జనం నైజం... చెడుని గుర్తించినంత తొందరగా మంచిని గుర్తించి గౌరవించకపోవడం లోక నైజం.... వెనకబడిన తరగతిలో పుట్టినా మీరెంత తెలివి తేటలతో స్వయం కృషితో పైకి వచ్చారన్నది ఎవరూ గుర్తించకుండా... మారని మీ వాళ్లని గురించి అవహేళన చెయ్యడం నిజంగా విచారకరం... బాగా మందలించాను... అందరూ బాధ పడ్తున్నారు అలా మాట్లాడినందుకు. ప్లీజ్.... ఈ విషయం మీరింక మర్చిపోవాలి... లేకపోతే నేను చాలా బాధపడ్తాను." సిన్సియర్‌గా అన్నాడు.

"ఏం చెయ్యను మూర్తిగారూ... ఎంత చెప్పినా, ఎంతగా వారిని మార్చాలని ప్రయత్నించినా వాళ్లాపాత అలవాట్లు మార్చుకోరు.... వాళ్లని కాస్త సంస్కారవంతులుగా మార్చాలన్న నా ప్రయత్నాలు ఫలించడంలేదు. వారి వల్ల నేను ఎంతనగుబాట్ల పాలవుతున్నానో... ఎంత నష్టపోయానో..." ఆవేదనగా అంది సుశీల అప్పుడితో చెప్పుకున్నట్టు.

"మేడమ్... మీరు ఒక సంగతి మర్చిపోతున్నారు.... మీరు ఈ తరం వారు... చదువుకున్నారు... చదువు సంస్కారాన్నిచ్చింది మీకు... మీ తల్లిదండ్రులు పాత తరం వారు. వారు పుట్టి పెరిగిన పరిసరాలు వేరు. చదువు సంధ్యలు లేక అనాగరికంగా పెరిగిన వారిలో సంస్కారం కొరవడడంలో ఆశ్చర్యం ఏముంది చెప్పండి... ఏ మార్పూ ఒక్క రోజులో రాదు. తరతరాలుగా మీ పూర్వులందరూ చదువు సంధ్యలు లేకుండా మట్టిలో పుట్టి మట్టిలో పెరిగి అదే జీవితం అనుకుంటూ కూపస్థ




మండూకల్లా బతికారు. ఒక్కసారిగా వారిలో మీరు నాగరికత, సంస్కారం, ఎలా తీసుకురాగలరు? ఈ తరంలో మీరు చదువుకున్నారు కనక రేపు మీ పిల్లల తరంలో దానంతట అదే సంస్కారం, నాగరికత వస్తాయి వారిలో. అలా ఇంకో రెండు జనరేషన్స్‌కి మీ అందరూ యింత వెనకబడిన తరగతుల వారి కింద జమ కట్టబడరు. మీరు కాస్త ఓర్పుగా, నేర్పుగా వారిని మార్చడానికి ప్రయత్నించాలి.

"మీకు తెలియదు మూర్తిగారూ... నేనెంతగా ప్రయత్నించినా వారిలో మార్పుతేలేకపోయాను. హాయిగా తిని శుభ్రంగా తయారై కూర్చోండి—అన్నా కూడా వాళ్లకి కష్టంగానే వుంది. ఇంటి శుభ్రం లేదు, వంటి శుభ్రంలేదు... వాళ్ల వల్ల నేను ఎంత హేళనపాలవుతున్నానో నాకు తెలుసు. అలా అని ఏ ఆధారం లేని వాళ్లని అలా గుడిసెల్లో వదిలేయలేను. ఒకసారి విరక్తిలో ఏ నాలుగు వందలో పారేసి ఆ గుడిసెల్లో పడుండండి అని పంపేద్దామనిపిస్తుంది... కాని వాళ్లు అలా గుడిసెల్లో బతకడమూ మళ్లీ నాకే అవమానం గదా..." ఆవేదనగా అంది.

మూర్తి ఆమె బాధని అర్థం చేసుకున్నట్టు సానుభూతిగా చూశాడు. "మేడమ్ ఒక చిన్న మాట చెప్పనా... మన భారతదేశం మిగతా సంపన్న దేశాలతో పోలిస్తే అతి బీద దేశం. ఈ దేశ ప్రజలలో మూడొంతులమంది చదువు, సంస్కారం లేని మూర్ఖులు. అజ్ఞానంతో, అంధకారంలో పడి కొట్టుకుంటున్న నిర్భాగ్యులు చాలామంది వున్నారు. ఈ దేశంలో బీదరికం, అనారోగ్యం, అజ్ఞానం, అశుభ్రత, ఆకలి, రోగాలు, రొచ్చులు అన్నీ ఎక్కువగానే వున్నాయి. మిగతా దేశాల ప్రగతి చూసి తలలు దించుకోవాల్సిన స్థితిలో వుంది మనదేశం. కాని మనది బీద దేశం అని, మన ప్రజలు దరిద్రులని సంస్కారం లేని వాళ్లని, యితర దేశాల ముందు తలలు దించుకోవాల్సిన పరిస్థితిలో వున్నామని... యిది నా దేశం కాదని మనం అంటామా!.... మన ప్రధాని తన దేశాన్ని చూసి సిగ్గుపడతాడా—వీళ్లు నా ప్రజ అని చెప్పుకోడానికి బిడియపడతాడా! చాతనయినంతగా తన దేశాన్ని సుభిక్షం చెయ్యాలని, ప్రజలకి చదువు సంస్కారాలు నేర్పాలని, విజ్ఞానవంతుల్ని చెయ్యాలని తాపత్రయపడుతున్నారు గదా. విదేశాల సహాయం తీసుకుని తన దేశాన్ని ఆ దేశాల స్థాయికి తీసికెళ్లాలని తాపత్రయపడ్తున్నారు గదా. తన కన్నతల్లిని, తన జన్మభూమిని తనది అని గర్వంగా చెప్పుకోడానికి సిగ్గుపడడం క్షమించరాని నేరం. దేశం ఎలా వుండనీయండి—ఎంత బీదరికంలో వుండ నీయండి. ఎంత కుసంస్కారంలో, అజ్ఞానంలో వుండనీయండి... ఆ దేశాన్ని నాది కాదు అని చెప్పుకుంటే ఆ పౌరుడు సిగ్గుపడి తలదించుకోవాలి. అలాగే... అజ్ఞానంలో వున్న మీ వాళ్లని చూసి మీరు సిగ్గు పడడం క్షమించరాని నేరమే అవుతుంది. కన్నతల్లిని, జన్మభూమిని ప్రేమించని వారు క్షమార్హులు కారు. మీరు చాతనయినంతగా మీ వారిని పైకి తీసుకొచ్చిన నాడే మీ చదువుకి, సంస్కారానికి సార్థకత చేకూరుతుంది. మీ వాళ్లని మీ స్థాయికి తీసుకురావడమే మీ ధ్యేయం కావాలి! మీ తరంలో మీరు సాధించిన ప్రగతి మీ ముందు తరాల వారికి మార్గదర్శకం కావాలి. ఎవరో మూర్ఖులనే మాటలకి బాధపడి, సిగ్గుపడితే రేపు మీరేం సాధించగలరు మేడమ్ క్షమించండి... మీ పర్సనల్ మేటర్ అనుకోకపోతే... ఈ రమాకాంత్ కాకపోతే వందమంది ఉమాకాంత్‌లు దొరక్కపోరు మీకు! పోనీండి దొరక్కపోతే.... జీవితానికి పెళ్లి ముఖ్యమేకాని పెళ్లే జీవితం కాదు!.... ఈ మాత్రం దానికి మీరు మనసు పాడుచేసుకోకూడదు మేడమ్ క్షమించండి, చాలా ఎక్కువ మాట్లాడినందుకు." ఆవేశంగా అన్నాడు మూర్తి.

అంతసేపు మూర్తి మాటలని విస్ఫారిత నేత్రాలతో వింటున్న సుశీల కళ్లలోకి మెరుపు వచ్చింది. నల్లబడిన ఆమె మొహంలో నలుపు మాయిమయింది. ముకుళించిన ఆమె మొహం వికసించింది. "థ్యాంక్స్ మూర్తిగారూ.. ఎంత బాగా చెప్పారు... మెనీ థాంక్స్. యూ ఓపెనేడ్ మై ఐస్... థాంక్స్ వన్స్ ఎగైన్..." తేలికపడ్డ మనసుతో టేబిల్ మీదవున్న ఫైలు ముందుకు లాక్కుంది సుశీల. □